ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు



ఎన్నికల విధులకు గైర్హాజరైన కార్యదర్శిపై చర్యలేవీ ?

ప్రజాశక్తి -హుకుంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులకు గైర్హాజరైన హుకుంపేట పంచాయతీ కార్యదర్శి కె.త్రినాథ్‌పై శాఖాపరమైన చర్యల్లో జాప్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు కేటాయించిన విధులను నిర్వర్తించకుండా డుమ్మా కొట్టడంపై మండల తహశీల్దార్, ఎంపిడిఒ వెంటనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ చర్యలను సిఫార్సు చేశారు. అయితే వారం రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడం, కనీసం దీనిపై విచారణ చేపట్టకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కాగా సంబంధిత కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరాలని డిపిఒకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. మరోవైపు మత్స్యపురం పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి కాగా, హుకుంపేటతోపాటు గత్తుం పంచాయతీలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో దాన్ని సాకుగా చూపి చర్యలు లేకుండా తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘంతోపాటు పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్బంధంపై నిరసన

మండల కేంద్రాల్లో అంగన్వాడీల ఆందోళన
పెద్ద ఎత్తున ర్యాలీలు, ధర్నాలు..
అధికారులకు వినతిపత్రాలు అందజేత

డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఆందోళనకు పిలుపునిచ్చిన అంగన్వాడీలను రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్బంధించి అరెస్టులు చేయడంపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అల్లూరి జిల్లాలోని పలుమండల కేంద్రాల్లో సోమవారం నిరసన ర్యాలీలు, ధర్నాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి -విలేకర్ల యంత్రాంగం

పాడేరు: అంగన్వాడీలపై జరిగిన నిర్బంధాలు అరెస్టులను వ్యతిరేకిస్తూ పాడేరు జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు నిరసన ర్యాలీ జరిపారు .అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వర్ధిల్లాలని, సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింప జేయాలని, అంగన్వాడీలకు ఫేస్ యాప్ హాజరు విధానం రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అంగన్వాడీలు నినాదాలు చేశారు.

అంబేద్కర్ సెంటర్లో నిర్వహించిన నిరసనలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఉద్యమిస్తున్న అంగన్వాడీలపై నిర్బంధాలు, అక్రమ అరెస్టులు దుర్మార్గమని ప్రభుత్వ చర్యలను ఖండించారు.చలోవిజయవాడ ఆందోళనకు వెళుతున్న అంగన్వాడీల పట్ల పోలీసుల అనుచిత వైఖరి, అమానుష ప్రవర్తను ఖండించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని చలో విజయవాడ ధర్నాకు పిలుపునివ్వడం పెద్దనేరంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్రీకరించం అన్యాయమన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, అలాకాక నిర్బంధాలతో అణచివేయాలని ప్రయత్నిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నేతలు అంబిక, చిన్నారి, దేవి, ఇంద్ర, సత్యవతి సిఐటియు నేత ఎల్.సుందరరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న అంగన్వాడీ కార్మికులను, సిఐటియు నేతల అరెస్టులు, గృహనిర్బంధాలను నిరసిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్మికులు ధర్నా చేపట్టారు. డిప్యూటీ తహసిల్దార్ షేక్ ముజీబ్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల నాయకుడు టి.సూర్యనారాయణ, అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షురాలు కె.కొండమ్మ, నాయకులు సత్యవతి, పవిత్ర, కె మల్లమ్మ, లలిత, రాధ, రుక్మిణి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్/అరకులోయ :అంగన్వాడీల వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మండల తహశీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ, ప్రాజెక్ట్ అధ్యక్షకార్యదర్శులు పి.వెంకటలక్ష్మి కె.లక్ష్మి మాట్లాడుతూ, అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని,అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని నినాదాలు చేశారు. అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రాధా భారతి, నిర్మల, వంజన సుశీల, భవాని, లక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

హుకుంపేట: చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న అంగన్వాడీల గృహనిర్బంధం, అరెస్టులు దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు హైమావతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

చింతూరు : తమ న్యాయమైన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ చలో విజయవాడ బయలుదేరిన అంగన్వాడీ వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంపై నిరసన వ్యక్తమైంది. సిఐటియు ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఆంధ్ర బ్యాంకు నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ఆందోళన చేపట్టారు. అనంతరం ఐటీడీఏ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు పోడియం సావిత్రి, సవలం వెంకటరమణ, అన్నపూర్ణ, కామేశ్వరి, వసంత, దుర్గ, జయ, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీ, సిఐటియు నేతల ముందస్తు అరెస్టులపై సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గంగవరం పోలీసు స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు, గిరిజన సంఘం నాయకులు కె.శాంతి రాజు, పి రామరాజు, లోతా రామారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి, నాలుగైళ్లయినా ఆ హామీ నెరవేర్చలేదన్నారు.తమ గోడు చెప్పుకోవడానికి విజయవాడలో మహా ధర్నాకు వెళ్తుండగా అక్రమ అరెస్టులకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. కోరుకొండలో సుమారు 50 మందిని అరెస్ట్ చేసి ఆర్టీసీ బస్సులో గంగవరం పోలీసుస్టేషన్‌కు తరలించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సుభద్ర, సీతామహాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్.పురం : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూణెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇచ్చి, జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, నాయకులు కుంజా నాగిరెడ్డి, వడ్లాది రమేష్, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పాడేరులో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



అరకులోయలో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు







చింతూరు, డుంబ్రిగుడ, రాజవొమ్మంగి మండలాల్లో ధర్నా అనంతరం,అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న సిఐటియు నేతలు, అంగన్వాడీలు

కాఫీ దిగుబడి, ఆదాయం పెంచడమే లక్ష్యం

◆ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



జ్యోతిప్రజ్వళనతో శిక్షణను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు: ఏజెన్సీలో కాఫీ పంట దిగుబడి, గిరిజన రైతులకు ఆదాయం, పెంచడమే లక్ష్యంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలోకాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ జయంతి ఘోష్ అధ్యక్షతన కాఫీ బోర్డు ఆధ్వర్యంలో కాఫీ లైజన్ వర్కర్లకు కాఫీ యాజమాన్య పద్ధతులపై జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. రైతు ఆదాయం ఉత్పత్తులు పెరగాలన్నారు. కాఫీలో మెరుగైన సస్యరక్షణ, పొదలు తొలగింపు, పురుగుల నివారణ పనులపై రైతులను చైతన్యవంతం చేయాలని అన్నారు. ఏజెన్సీలో కాఫీ అభివృద్ధికి ఐటిడిఏ ,కాఫీ బోర్డు, స్పైసెస్ బోర్డులు కృషి చేయాలన్నారు.

ఆర్‌వి నగర్ ఆర్‌సిఆర్‌ఎస్ డిడి డాక్టర్ అటిఖర్ రెహ్మాన్ బోరా, సబ్జెక్టు స్పెషలిస్టు డి.సునీల్‌బాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కాఫీ సాగులో మెళకువలు, సస్యరక్షణ, కాండం తొలుచు పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. .తెల్ల పురుగు ఆశించిన కాఫీ మొక్కలను గుర్తించి తొలగించాలని సూచించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎస్ ఎల్ ఓ విష్ణు, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, పిహెచ్ ఓ ఎన్. అశోక్, కాఫీ ఎక్స్ టెన్సన్ ఇన్‌స్పెక్టర్ ఇ. రమేష్ ,స్పైసెస్ బోర్డు సీనియర్ పీల్డు ఆఫీసర్ కల్యాణి, కాఫీ ఉద్యాన అధికారులు, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థిని శాంతి

ప్రజాశక్తి -హుకుంపేట: అనారోగ్యంతో విద్యార్థి మతి చెందిన ఘటన మండలంలోని గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. మండలంలోని గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన వల్లాయి బిమలమ్మ, అప్పన్న దంపతుల ద్వితీయ కుమార్తె వల్లాయి శాంతి (10) గాలిపాడు ఎంపిపి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. పాఠశాలలో ఉండగానే అస్వస్థతకు గురికావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు ఈ నెల 15న శుక్రవారం తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 10గంటలకు శాంతి మృత్యువాత పడింది. మృతదేహాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు కెజిహెచ్‌లో వైద్యులు అప్పగించారు. అనారోగ్యం వచ్చిన కేవలం ఆరురోజుల్లోనే అల్లారుముద్దుగా పెంచుకున్న తమబిడ్డచనిపోవడంతో బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై కెజిహెచ్‌లోని ఎస్‌టి సెల్ విభాగం సరిగా దృష్టి పెట్టక వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహించడం వల్లే మృతుని తల్లిదండ్రులు వాపోతున్నారు. సరైన వైద్యసేవలు అందించిఉంటే తమబిడ్డ చనిపోయేదికాదని బాలిక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆరోపిస్తున్నారు. కాగా విద్యార్థిని మృతిపై జిల్లా కలెక్టర్ స్పందించి, బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ కె.ఆనంద, కో కన్వీనర్లు జె.బాలన్న, రత్నకుమార్ డిమాండ్ చేశారు.

రెండు నెలలుగా అందని రేషన్ బియ్యం

◆ పెద్దబిడ్డ రేషన్‌డిపో వద్ద గిరిజనుల ధర్నా
◆ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



రేషన్ డిపో వద్ద ఆందోళన చేస్తున్న కార్డుదారులు

ప్రజాశక్తి -అనంతగిరి : కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తక్షణమే ఇవ్వాలని సోమవారం పెద్దబిడ్డ గ్రామానికి చెందిన కార్డుదారులు రేషన్‌డిపో వద్ద ఆందోళన చేపట్టారు. తమ గ్రామాల్లో ఫిబ్రవరి, మార్చి నెలలకు కేంద్ర ఉచిత రేషన్ బియ్యం ఇప్పటివరకు ఇవ్వలేదని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అసలు రేషన్ ఇస్తున్నారో, లేదో కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి, పెద్ద బిడ్డ పంచాయతీ సర్పంచ్ కె.పెంటమ్మలతో కలిసి మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి, అక్కడ నిరసన చేపట్టి, తహశీల్దార్ రమాభాయికి వినతిపత్రం అందజేశారు.

అంతకుముందు గ్రామంలో రేషన్‌డిపో వద్ద చేపట్టిన ఆందోళనతో తమకు బియ్యం, ఇతర సరుకులు సక్రమంగా ఇవ్వని డీలర్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంటమ్మ, జన్ని. బుజ్జిబాబు, రేషన్‌కార్డుదారులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని 24 గ్రామాలలో 587 మంది కార్డుదారులున్నారన్నారు. అనేకమంది కార్డుదారులకు గడచిన డిసెంబర్‌లో రేషన్‌బియ్యం ఇవ్వలేదని, ప్రస్తుతం ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూర్తిగా ఇవ్వలేదన్నారు. మూడు నెలలకు సంబంధించి రేషన్‌డిపో చుట్టూ ప్రదక్షణలు చేయడం, అక్కడివెళ్లి పడిగాపులు పడుతున్నామే తప్ప, ఉచితమో లేకుంటే రూపాయికి కిలో బియ్యమో ఏదో ఒకటైనా ఇవ్వాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కు లేదన్నారు. దీనిపై గతనెల 24న ఐటిడిఎ పిఒను కలిసి లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించినా ఇప్పటికవరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు పది టన్నుల బియ్యం కార్డుదారులకు అందని వ్యవహారం, పేద గిరిజన లబ్ధిదారులు ఆర్థాకలితో అలమటిస్తూ రేషన్ ఇవ్వని అక్రమాలపై చర్యల్లో నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు.

జిఒ1పై నిరసన తెలిపితే దాడులా ?

మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి ధ్వజం

ప్రజాశక్తి-పాడేరు టౌన్ : జిఒ1తో ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలను అణచివేయాలని రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం చూస్తోందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. జిఒ1పై నిరసనలు తెలిపితే అసెంబ్లీలోనే వైసిపి ఎమ్మెల్యేలు గూండాలుగా వ్యవహరించి, టిడిపి ఎమ్మెల్యేలపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు శాంతియుత నిరసనలను తెలియజేసే ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ1 రద్దు చేయాలని విపక్షాలు, ప్రజాసంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రతి పౌరుడు తీవ్రంగా ఖండించాలని కోరారు. స్పీకర్ సాక్షిగా టిడిపి ఎమ్మెల్యేలపై దాడి జరిగిందని, జరిగిన ఘటన వీడియోను సభాపతిరిలీజ్ చేయాలన్నారు



ప్రజల సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

స్పందనకు 46 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 46 అర్జీలు అందాయి. వీటిని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ బాబు, డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు. ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూష, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంపై చర్యలు

- పాడేరు ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

- డౌనూరు పిహెచ్‌సి వైద్యాధికారి, డ్రైవర్‌కు జీతాలు నిలుపుదల

ప్రజాశక్తి-కొయ్యూరు

వైద్య సిబ్బంది విధుల్లో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం కొయ్యూరు మండలం డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ లలిత, అంబులెన్స్ డ్రైవర్ జి.కాంతారావు విధులకు గైర్హాజరయ్యారు కావడంతో వారి జీతాలు నిలుపుదల చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను, హాజరు పట్టిని పరిశీలించారు. మందుల నిల్వలు, ఆసుపత్రి ప్రసవాలు, వైద్య శిబిరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేయాలని చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు



తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, రైతు సంఘం మండల కార్యదర్శి వడ్లాది రమేష్ డిమాండ్ చేశారు. వర్షాలు కారణంగా తడిసిన మిర్చి, పోగాకు పంటలను సిపిఎం, రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వల్ల మిర్చి రైతులకు జరిగిన పంట నష్టాన్ని వెంటనే అధికారులు అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు తక్షణమే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని తెలుసుకోవాలని, రైతులకు భరోసా కల్పించాలని కోరారు. తడిసిన మిర్చి, పొగాకు పంటలకు మార్కెట్ ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కుంజ నాగిరెడ్డి, రైతు వెంకన్న బాబు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో నూతనంగా 37 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవిఎన్ అప్పారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం దుప్పిలివాడ, నేలజర్త, మాదిగమళ్ళు, దబ్బకోట, తోటనగరం గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలు తొలగించి వాటి స్థానంలో సిమెంటు కాంక్రీట్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవించినప్పుడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించామని తెలిపారు. ఈ క్రమంలో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కొత్తగా ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం ఏర్పడదని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.



స్తంభాలు వేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మినీ స్నానపు ఘాట్ నిర్మాణం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో సీలేరు మారమ్మ ఆలయం ఎదురుగా జలాశయం సమీపంలో మినీ స్నానపు ఘాట్ నిర్మాణం పనులు చేపట్టారు. సోమవారంతో కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. ఈ ఘాట్ నిర్మాణం పూర్తయితే కార్తీక మాసంలో భక్తులకు, అయ్యప్ప భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అలాగే ఏప్రిల్‌లో నిర్వహించే మరమ్మ అమ్మవారి ప్రధాన పండగ సమయంలో భక్తులకు ఈ మినీ స్నానపు ఘాట్ ఎంతగానో దోహదపడుతుంది. నిధులు వెచ్చించి నిర్మాణం చేయడం పట్ల ఆలయ కమిటీ నాయకులు కె.శ్రీనివాస్, టి.భట్టో కృతజ్ఞతలు తెలిపారు.



కాంక్రీట్ పనులు పూర్తయిన స్నానపు ఘాట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూముల రీసర్వేకు అత్యధిక ప్రాధాన్యత

-జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు : రెవెన్యూ అధికారులు భూముల రీసర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఐటిడిఎ పిఒలు, సబ్ కలెక్టర్లు, 22 మండలాల తహశీల్దారులు, సర్వేయర్లతో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో చేపట్టిన భూముల రీసర్వే, పివిటిజి ఓటర్ల నమోదుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా భూముల రిజిష్టరు తయారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహశీల్దారులకు సూచించారు 65 గ్రామాలకు ఫారం 13 నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. . 485 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, 216 గ్రామాలలో వెక్టరైజేషన్ పూర్తయ్యిందన్నారు. సర్వేయర్ల డేటా ఎంట్రీ ప్రారంభించాలని ఆదేశించారు. సర్వేలో లోపాల లేకుండా తగిన పారదర్శకత పాటించాలన్నారు. నోడల్ అధికారులు రీసర్వేపై సమీక్షలు నిర్వహించాలన్నారు. సర్వే, డిఎల్ఆర్, వెక్టరైజేషన్ వేగంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలాలకు కేటాయించిన రోవర్లు ఎక్కడా ఖాళీగా ఉండకుండా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో ఉండాలన్నారు. రోవర్లను సక్రమంగా వినియోగించి, ప్రతిరోజూవంద సర్వే పాయింట్లు సేకరించాలని ఆదేశించారు. విఆర్ఒలు, గ్రామ సర్వేయర్లు బృందాలుగా సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. సర్వే పూర్తి చేసిన చోట సర్వే నంబర్లు, ఎల్‌పి ఎం నెంబర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. మ్యుటేషన్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. డి.ఫారం పట్టాలు పంపిణీకి సర్వం సిద్ధం చేయాలన్నారు.పౌర సేవల్లో జాప్యం చేయకూడదన్నారు.

నెలాఖరులోగా పివిటిజి ఓటర్ల నమోదు పూర్తి

పివిటిజి ఓటర్ల నమోదు ప్రక్రియ పక్కాగా నమోదు చేపట్టి, నెలాఖరలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలానికి రెండు వేల ఫారం-6, వెయ్యి ఫారం -7 పత్రాలు సరఫరా చేస్తామన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఓటర్లు ఇంటికి ఫారం 6 దరఖాస్తులు సేకరించాలన్నారు. 2019 తర్వాత మృతిచెందిన ఓటర్ల వివరాలను ఎంపిడిఒల నుంచి సేకరించి, ఆయా ఇళ్లకు వెళ్లి ఫారం 7 దరఖాస్తుల ద్వారా మృతుల ఓటర్లను తొలగించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, డిఆర్ఒ అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో పోలీసుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- పెదబయలు : మన్యంలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లుఎస్ఐ పి.మనోజ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పంట నష్టాలు, అనారోగ్య సమస్యలపై ఆరా తీశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంజరి, గిన్నెలకోట పంచాయతీల పరిధిలోని పిట్టల బొర్రా, ఎగువ తారబు, సప్పర్ల మామిడి, అంబరుపాడు, జొడియపుట్టు, కొండ్రుం, జాముడం, ననుబరి జక్కం గ్రామాలలో మూడు రోజులపాటు సందర్శించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరానికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే మావోయిస్టులు, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, నాటుసారా వల్ల కలిగే అనర్థాలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని గిరిజన యువత బాగాచదువుకుని భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

నేటి నుంచే విద్యార్థులకు రాగిజావ

పాఠశాలల్లో ఉదయం 8:45 గంటలకు పంపిణీకి సన్నాహాలు

సాధ్యాసాధ్యాలపై సర్వత్రా అనుమానాలు



స్కూళ్లకు పంపిణీ చేసిన రాగి పిండి



5 కిలోల బెల్లపు పొడర్ ప్యాకెట్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అదనపు ఆహారంగా రాగుల పిండి, బెల్లంతో తయారుచేసిన రాగిజావను జిల్లాలో పాఠశాలల్లోని బాలబాలికలకు ఈనెల 21 నుంచి పంపిణీ చేయడానికి విద్యాశాఖ సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన ఆదేశాలు పాఠశాల విద్యాశాఖ జారీ చేసింది. సగటున ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల చొప్పున జావ పంపిణీ చేయాలి. సకాలంలో తయారు చేయడానికి వంట మనుషులకు ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి వాటిపై ఉన్నత స్థాయి నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. పంపిణీ తేదీ ఖరారుతో పాటు దాని తయారీకి అవసరమైన రాగి పిండి, బెల్లం మాత్రమే పాఠశాలలకు పంపారు. విద్యార్థులకు దాన్ని సకాలంలో తయారు చేసి ఇవ్వడానికి సంబంధించిన వంట మనుషులు, టీచర్ల భాగస్వామ్యం గురించి తెలియజేయకపోవడంతో ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది. పిల్లలు ఇప్పటివరకు పాఠశాలలకు కేవలం వాటర్ బాటిళ్లు మాత్రమే తెచ్చుకుంటున్నారు. భోజనం చేయడానికి పాఠశాలల్లోని ప్లేట్లు ఉంటాయి. విద్యార్థులే ఇంటి నుంచి గ్లాస్ తెచ్చుకుంటే తప్ప జావ పంపిణీ చేయలేరు.

రాగి జావ వేడిగా స్టీల్ గ్లాస్ తప్పనిసరి...

వేడిగా పంపిణీ చేసే రాగిజావ తాగాలంటే విద్యార్థులకు స్టీల్ గ్లాస్ తప్పనిసరిగా అవసరం. ఒకవేళ విద్యార్థులు ఇంటి నుంచి స్టీల్ గ్లాస్ తెచ్చుకోకపోతే ప్లాస్టిక్ లేదా పేపర్ గ్లాస్ ప్రభుత్వం ఇస్తే తప్ప దాన్ని అందరు విద్యార్థులకు పంపిణీ చేయలేని పరిస్థితి. కానీ పాఠశాల విద్యాశాఖ నుంచి సోమవారం వరకు వీటికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు. జావ వేడిగా పేపర్ గ్లాస్, ప్లాస్టిక్ గ్లాస్‌లు లీక్ అయ్యే అవకాశం ఉంది. వేడివేడి జావ జారిపడిన, లీకై పడిన శరీరం కాలుతుంది. వీటన్నింటి దృష్ట్యా దీని పంపిణీ విషయంలో అనేక జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

వంట మనుషులు ముందుగా వస్తేనే..

ప్రస్తుతం మధ్యాహ్న భోజనం తయారీకి వంట మనిషికి రూ.3వేల చొప్పున గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారు. రాగిజావ తయారీ నిమిత్తం వంట మనుషులకు అదనపు పారితోషికం లేదా గౌరవ వేతనం పెంపుదలపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. వారు ఉదయం 9:30కు వచ్చి 12 గంటల లోపు మధ్యాహ్న భోజన వంట సిద్ధం చేస్తారు. ఆ తర్వాత ఉపాధ్యాయుల సమక్షంలో పిల్లలకు వడ్డన చేస్తారు. రాగిజావను ఉదయం ప్రార్థనకు ముందు అంటే 8:45 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉదయం 8 గంటలకే వంట మనిషి వస్తేకానీ రాగిజావ సిద్ధం చేయలేరు. ప్రస్తుతం టీచర్లు 9 గంటల్లోపు బడికి చేరుకుంటున్నారు. వచ్చి రాగానే ముఖ హాజరు నమోదు చేస్తున్నారు. టీచర్ల భాగస్వామ్యం లేకుండా పిల్లలకు జావ పంపిణీ సాధ్యం కాదు. అలా అవ్వాలంటే టీచర్లు అరగంట ముందే బడికి రావాల్సి ఉంటుంది. వీటన్నింటిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం

హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగి జావ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. విద్యార్థులకు తాత్కాలికంగా గ్లాసుల ఏర్పాటు చేస్తాం. ఉదయం ప్రార్థనకు ముందే వంట మనుషులు వచ్చే ఏర్పాటు చేస్తున్నాం. ఉపాధ్యాయులు కూడా ఆ సమయంలో హాజరవుతారు. జావా నిమిత్తం విద్యార్థులకు ప్రత్యేకంగా స్టీల్ గ్లాసులను ప్రభుత్వం పంపిణీ చేసే అవకాశం ఉంది.



డాక్టర్ ఎస్ కె సలీం బాషా,
డిఇఒ, అల్లూరి జిల్లా

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశామని అరకులోయ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాలివి. ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లా పాడువా ప్రాంతం ఇన్నింగుడ గ్రామానికి చెందిన కిల్లో రవీందర్ 2022 ఏప్రిల్ నెలలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులకు 6 కిలోల గంజాయి రవాణాకు సహకరిస్తూ, పోలీసులు గుర్తించినా పట్టుబడకుండా పరారీలో ఉన్నాడు. సోమవారం ఎండపల్లివలస ప్రాంతంలో రవీందర్ తిరుగుతుండగా అరెస్టు చేశామని ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

మెగా క్రికెట్ టోర్నీ ప్రైజ్ మనీ పెంపు

- విజేతకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు

ప్రజాశక్తి -పాడేరు: ఈ ఏడాది మే నెలలో పాడేరులో నిర్వహిస్తున్న మన్య ప్రజల ఆరాధ్య దైవం మోద కొండమ్మ ఉత్సవాలు పురస్కరించుకొని ఈనెల 30 నుంచి నిర్వహించబోతున్న రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీ ప్రైజ్ మనీని పెంచుతున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఎ.రాజారావు, పాంగుల మహేష్, కె.దుర్గారావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈటోర్నీలో విజేతలకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు నగదు బహుమతులతోపాటు షీల్డ్ అందజేస్తామన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లకు వ్యక్తిగత బహుమతులు కూడా అందజేస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలియజేసింది

. ఈ టోర్నీలో పాల్గొనదలిచిన క్రికెట్‌జట్లు ఎంట్రీ ఫీజు కింద రూ.మూడు వేలు చెల్లించాలని, ఆటగాళ్ల విధిగా యూనిఫాం, షూస్ ధరించాలని సూచించారు. ఆసక్తి ఉన్న క్రికెట్ జట్లు 85005 74489, 83096 68683 ఫోన్ నెంబర్లకు సంప్రదించి ఈనెల 28 లోగా ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు. 29న క్రీడాకారుల సమక్షంలో డ్రా తీస్తామని, 30 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా దేముడు



ప్రజాశక్తి - అనంతగిరి : అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా అనంతగిరి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు పుడిగి దేముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు చింతూరులో రెండు రోజులుగా జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో నిర్వహించిన కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికలో దేవుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు జిల్లా కౌన్సిల్‌లో అవకాశం కల్పించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు విద్య, ఉపాధ్యాయ సమస్యలపై తాను భాగస్వామినౌతాయని, యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా దేముడు ఎన్నికపై తోటి ఉపాధ్యాయులతోపాటు యుటిఎఫ్ నేతలు ఎస్. రాంబాబు ఎన్. మల్లేశ్వరరావు వివి ఈశ్వరరావు తదితరులు హర్షం వెలిబుచ్చి అభినందించారు.

పిల్లల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి

ఎస్‌బిసిసి సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో రక్తహీనత పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.సోమవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సోషల్ బిహేవియర్ చేంజ్ కమ్యునికేషన్ (ఎస్‌బిసిసి) చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ, సామాజిక ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని, తద్వారా రక్తహీనతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న అనీమియా పరీక్షల్లో రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారికి గుర్తించి, రక్తహీనత వల్ల కలిగే అనర్థాలు,నష్టాలపై వారికి అవగాహన కల్పించే బాధ్యతను అందరూ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలలో 70 నుండి 80 శాతం రక్తహీనత సమస్య ఉందని,దానిని నివారించి ఆరోగ్యకరమైన సమాజంగా తీర్చి దిద్దటానికి కృషి చేయాలని కలక్టర్ పిలుపునిచ్చారు. ఐసిడిఎస్, వెలుగు, విద్యా, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహించే సమావేశాలలో రక్తహీనత, బాల్య వివాహాలు, పారిశుధ్య నిర్వహణ, చేతుల పరిశుభ్రత, విద్య, పౌష్టికాహారం, తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. తరచుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. ఈమేరకు ముందుగా షెడ్యూల్‌ను రూపొందించి, నెలలో రెండుమూడు మండలాల్లో సమావేశాలను నిర్వహించి, వాటికి సంబంధించిన సమాచారంతో ఫొటోలు,వీడియో క్లిప్పింగ్‌లను సమర్పించాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి అన్ని మండలాలను పూర్తిగా కవర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో సుస్థిర అభివద్ధికి నిర్దేశించిన లక్ష్యాలు సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాలలలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. విద్యాలయాల్లో శత శాతం మౌలిక సదుపాయాల కల్పన, బాలికల టాయిలెట్ల నిర్వహణ, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి 10 -19 ఏళ్ల కిశోర బాలికల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి, తక్కువ బరువు, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్‌బిసిసిసమావేశంలో శిక్షణ కలక్టర్ అశతోష్ శ్రీవాత్సవ, సభ్యులైన గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు, ఐ.కొండలరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, డిఇఒ షేక్ సలీంభాషా, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్య లక్ష్మి, ఎల్‌డిఎం రవితేజ, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె. పట్నాయిక్, ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ ఎం.రమేష్‌నాయుడు, పరిమళ ఫౌండేషన్, స్మైల్, గిరిజన చైతన్య వెల్ఫేర్ సొసైటీ, ట్రైబల్ కమ్యునిటీ డెవలప్‌మెంట్ సొసైటీ, సంజీవని మొదలగు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ర్యాలీ చేస్తున్న విఒఎలు

సమస్యల పరిష్కారానికి వెలుగు విఒఎల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వెలుగు విఒఎలు డిఆర్‌డిఎకార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఒఎల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ భాను, ఎల్ బి రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ ఉపాధికి నష్టం కలిగే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే అమలు జరిగితే 20 ఏళ్లుగా పనిచేస్తున్న తామంతా రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు అల్లూరి జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో విఒఎల సంఘం జిల్లా నాయకులు రంజిత, పోతురాజు, చంటి, భాస్కర్, దోన్ను, ఆనంద్, జిల్లాలోని పలు మండలాల నుంచి 170 మంది వెలుగు విఒఎలు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మద్దిలపాలెం జంక్షన్‌లోని సిఎంఆర్ సెంట్రల్ గోడవైపు ఉన్న 20 తోపుడు బండ్లపై కార్మికులు 20 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని, వారి పొట్టగొట్టేలా ఇప్పుడు మెయిన్ రోడ్డు వైపు పెన్సింగ్ వేయడానికి జివిఎంసి అధికారులు చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం తోపుడు బండ్ల కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ ఇక్కడి కార్మికులకు పాత పద్ధతిలోనే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇక్కడ హాకర్ జోన్‌ను ప్రకటించారని, వెండింగ్ బోర్డు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. జి 20 సమావేశాల పేరుతో 15 రోజులుగా మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వైపు గ్రీన్ బెల్ట్‌కి పెన్సింగ్ వేస్తున్నారని, అందులో భాగంగా తోపుడు బండ్ల కార్మికులకు హాకర్ జోన్ ప్రకటించిన ప్రదేశంలోనూ పెన్సింగ్ వేయడం ప్రారంభించారని చెప్పారు. దీంతో తోపుడు బండ్ల కార్మికులు వ్యాపారం చేసుకోవడానికి, కొనుగోలుదారులు రావటానికి వీలులేకుండా పోతుందన్నారు. రెండు వారాలుగా ఫెన్సింగ్ వేయటం వల్ల వ్యాపారాలు లేక వీధి వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మరోవైపు మాధవధార హైవేలో కార్ల షోరూమ్‌లకు, షాపింగ్ మాల్స్‌కు, నివాస ప్రాంతాలకు గ్రీన్ బెల్టు ప్రాంతాల్లో రోడ్లు వేసి వ్యాపారులకు అవకాశం కల్పించారని చెప్పారు. అదేవిధంగా సిఎంఆర్ సెంట్రల్ వద్ద తోపుడు బండ్ల వ్యాపారులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం, జి.శ్రీనివాసరావు, ఎస్.చిన్ని తదితరులు పాల్గొన్నారు. అనంతరం జివిఎంసి కమిషనర్‌కు స్పందనలో వినతి పత్రం సమర్పించారు.

పోషణ అభియాన్ పథకంతో ఆరోగ్య ప్రయోజనాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోషకాహార లోపం, రక్తహీనత, తక్కువ బరువును అధిగమించేందుకు పోషణ అభియాన్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'పోషణ అభియాన్ పథకం'లో పోషణ పంచాయతీలను సిద్ధపరచడంలో సర్పంచ్‌ల పాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ అభియాన్ పథకం ద్వారా యుక్తవయస్సులో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 0-6 సంవత్సరాల వయస్సు నుంచి పిల్లల పోషకాహార స్థితిపై దృష్టిపెట్టనున్నామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరి, రీజినల్ ఆర్గనైజర్ మాధవి వర్మ, కేర్ ఇండియా సభ్యులు సుబ్రహ్మణ్యం, వాసవి విల్లా, దేవి పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి, సింహాచలం

విశాఖలో 22 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పంచగ్రామాల సమస్యను పరిష్కరించేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం అమరావతి సచివాలయం రెండో బ్లాకు మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనర్సింహ స్వామి భూములను పరిరక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. అక్కడ నెలకొన్న పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి సంబంధించి అటు దేవస్థానం భూమికి నష్టం వాటిల్లకుండా, ఇటు అక్కడ చాలా కాలంగా నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమస్య పరిష్కారానికి త్వరలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి తన అధ్యక్షతన జిల్లా మంత్రులు, ఎంపీ, ఇద్దరు శాసన సభ్యులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం, సిసిఎల్ఎ, జిల్లా కలెక్టర్ తదితర సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఆ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో నిర్వహించి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించామని, రెండు రోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అదేశాల మేరకు దేవస్థానం భూమి విలువకు సమానమైన భూమిని దేవస్థానానికి ప్రభుత్వం బదలాయించేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. అంతకు ముందు జరిగిన కమిటీ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంఎల్ఎ అదీప్ రాజు, సిసిఎల్ఎ జి.సాయి ప్రసాద్, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, అదనపు సిసిఎల్ఎ ఇంతియాజ్, దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు.


సమస్యను పరిష్కరించండి : సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం

పంచ గ్రామాల సమస్యను త్వరగా పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి కోరారు. గత ప్రభుత్వం ఇళ్ల మరమ్మతులకు అనుమతివ్వగా దేవస్థానం అధికారులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

ఆర్ఎఎస్ దేశానికి అంకితం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఐసిఎఆర్-సిఎంఎఫ్ఆర్ఐ విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ ఫిన్ ఫిష్‌ల నర్సరీ పెంపకం కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన రీ సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ (ఆర్ఎఎస్)ను ఐసిఎఆర్-సిఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణన్ సోమవారం దేశానికి అంకితం చేశారు. విశాఖ బీచ్ రోడ్డులోని సిఎంఎఫ్ఆర్ఐ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎఎస్ ద్వారా 12 గ్రాముల చేప విత్తనాన్ని రూ.11.20కే ఉత్పత్తి చేయగలమన్నారు. ఇది భారతీయ సముద్ర వ్యవసాయానికి ఆర్థికంగా ఉపయోగపడుతుందని తెలిపారు. గతంలో ఉపయోగించిన నీటిని రీ సర్క్యులేట్ చేస్తూ బ్రూడ్‌స్టాక్ డెవలప్‌మెంట్ బ్రీడింగ్ కోసం ఆర్ఎఎస్ వ్యవస్థను అభివృద్ధి చేశామన్నారు.



ఆర్ఎఎస్‌ను జాతికి అంకితం చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గోపాలకృష్ణన్

దేశంలోనే సముద్రతీర పరిశోధనలో ఇదొక కీలక పురోగతి అని, పారిశ్రామికవేత్తలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. అనంతరం సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన రైతుల శిక్షణ హాస్టల్ 'ఇండియన్ పాంపనో'ను ఆయన ప్రారంభించారు. ఈ క్రమంలోనే మూడు అవగాహనా ఒప్పందాలు జరిగాయి. ఎంఎస్ఆర్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్‌తో భారతీయ పాంపనో కోసం బ్రూడ్‌స్టాక్ డెవలప్‌మెంట్, సీడ్ ప్రొడక్షన్ టెక్నాలజీ కోసం, రేవతి బండారుతో భారత పాంపనో సముద్రపు పంజర పెంపకంపై సాంకేతిక సేవల కోసం, లయ స్వచ్ఛంద సంస్థతో సముద్రపు పాచి సాగులో సాంకేతిక సేవల కోసం ఈ ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్‌సి డాక్టర్ జె.చార్లెస్ జీవా, డాక్టర్ శుభదీప్ ఘోష్ పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు అన్నారు. మండలంలో ఐ పోలవరం పంచాయతీ పరిధిలో సోమవారం టిడిపి నాయకులు ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ కారు డ్రైవర్ అయిన దళితుడ్ని హత్య చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ను ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించకపోవడం ఆ పార్టీ అనైతికతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, సిద్ధ వెంకన్న, మడకం పండు దొర, విజయ, నర్సిరెడ్డి, అబ్బాయి దొర తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ అడ్మినిస్ట్రేషన్ గేటు, ట్రైనింగ్ సెంటర్ వద్ద సోమవారం ఉదయం ధర్నా చేపట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, తక్షణమే 2017 వేతన ఒప్పందాన్ని సెయిల్‌లో మాదిరి అమలు చెయ్యాలని పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సిక్ ఇండస్ట్రీగా మార్చాలని కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాలను విరమించుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కర్మాగారంలో ఉత్పత్తికి సరిపడా ముడిసరుకు నిల్వలు ఉంచాలన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను మూలధనంలో ఈక్విటీగా మార్చాలని, వడ్డీపై పది సంవత్సరాల పాటు ఇంట్రెస్ట్ హాలీడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను మూసేసి అదానీకి అమ్మాలని చూడటం దారుణమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బిసి రోడ్‌లో మంగళవారం జరగనున్న ధర్నాను సైతం కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఎంపీల మద్దతు కూడగట్టనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖలోని ఎంపీలను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అన్ని వైపుల నుంచీ ఒత్తిడి పెంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. పోరాటాలతో సాధించుకున్న కర్మాగారాన్ని పోరాటాలతోనే నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కెఎస్ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, వైటి.దాస్, వై.మస్తానప్ప, విళ్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని విశాఖ జాయింట్ కలెక్టర్ కెయస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగులో ఉన్న పిటీషన్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇదిలా ఉండగా సోమవారం స్పందన కార్యక్రమంలో 155 విజ్ఞప్తులు అందాయి. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేయర్ భర్తపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను దుర్భషలాడి బెదిరించిన నగర మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం పోలీస్ కమిషనరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆరిలోవలోని తోటగరువు స్కూల్ వద్దగల పోలింగ్ బూత్ దగ్గర ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వామి విధులు నిర్వహిస్తుండగా శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

నీట్ పీజీ ర్యాంకర్‌కు ఎంపీ ఎంవివి అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నీట్ పీజీ 2023లో ఆల్ ఇండియా 750వ ర్యాంకు సాధించిన ఐశ్వర్యమిని సిద్ధానాతిని విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనలేని కృషి, పట్టుదల, కఠోర శ్రమతో ఇలాంటి విజయాలు సాధ్యమని తెలిపారు. ఐశ్వర్యమిని ఎంసెట్ 2016లో 127 ర్యాంక్ సాధించి, విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివారని గుర్తు చేశారు. ఆమె తండ్రి డాక్టర్ నవీన్ సిద్ధానాతి ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్‌కాగా, తల్లి పద్మావతి గృహిణి అని తెలిపారు.

22న తన్మయి ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తన్మయి క్రియేటివ్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 22న ఉగాది సంబరాలు నిర్వహించనున్నామని, ఐదుగురు ప్రముఖుల సేవలను, ప్రతిభను గుర్తించి పురస్కారాలు అందజేయనున్నామని ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్.చంద్రశేఖర్, సిహెచ్‌వి.సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో తన్మయి క్రియేటివ్స్ వ్యవస్థాపక సభ్యురాలు శారద, దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి, సాంస్కృతిక సంస్థల వారధి కొణతాల రాజు, న్యాయవాది హరిమెహర్ పాల్గొన్నారు.